సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 10 । మార్చి । 2023



టన్ను చీనీ రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.9°/14.1°
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట ఇంకా అక్కడక్కడా చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలింగ్ సామగ్రి సిద్ధం చేయండి



జంబో బ్యాలెట్ బాక్సును పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ప్రిసైడింగ్ అధికారుల చెక్‌లిస్ట్ ఆధారంగా సూచించిన దాదాపు 30 రకాల వస్తువులను తప్పనిసరిగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పంపిణీ జరిగేలా చూడాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో పోలింగ్ కేంద్రాల వారీగా సిద్ధం చేసిన పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ పేపర్లు, జంబో బ్యాలెట్ బాక్సులను ఆయన పరిశీలించారు. కలెక్టరేట్ నుంచి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలకు చెక్ లిస్ట్ ప్రకారం అన్నీ సరి చూసుకొని పంపాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలకు పింక్ కలర్, పట్టభద్రుల నియోజక వర్గానికి తెలుపు రంగు బ్యాగ్‌లలో సిద్ధం చేసిన ప్రతి వస్తువును పంపించాలన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 10 మంది డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కోర్సు రెగ్యులర్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 10 మంది విద్యార్థుల డీబార్ అయినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురం, కొత్తచెరువు, కళ్యాణదుర్గంలో ముగ్గురేసి చొప్పున , తాడిపత్రిలో ఒక విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.

మహిళలు స్వశక్తితో రాణించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

హిందూపురం టౌన్: మహిళలందరినీ మహిళా సాధికారత దిశగా నడిపించటం కోసం నిర్వహించే సంబరమే అంతర్జాతీయ మహిళా దినోత్సవమని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య అన్నారు. గురువారం పట్టణంలోని వైకేపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పీడీ నరసయ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ముందుండాలని, స్వశక్తితో రాణించాలని సూచించారు. అనంతరం పలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ రామిరెడ్డి, ఏపీఎం రామకృష్ణ, ఉన్నతి ఏపీఎం లలిత, స్త్రీనిధి మేనేజర్ పద్మావతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సిద్దగంగమ్మ, ఎల్‌సీలు విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రప్ప, యానిమేటర్లు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

సిద్ధమైన బ్యాలెట్ పత్రాలు



బ్యాలెట్ పత్రాలను సరి చూస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లు తప్పులు లేకుండా సిద్ధం చేయాలని డీఆర్‌ఓ కొండయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ కార్యాలయంలో అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. బ్యాలెట్ పత్రాలు చిరగ కూడదని, ప్రింటింగ్ సక్రమంగా లేనివి ఉంటే గుర్తించాలని, సీరియల్ నంబర్లు సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏఏ పోలింగ్ కేంద్రానికి ఎన్ని కావాలో సరి చూసి పంపాలన్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 49 మంది పోటీ పడుతుండగా బ్యాలెట్ పత్రం పెద్ద సైజులో ఉందన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం 12 మంది పోటీ పడుతుండటంతో సాధారణ సైజులో ఉందన్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటర్లు సుమారు 43,310 మంది, టీచర్స్ ఎమ్మెల్సీకి 3,348 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు.

ప్రగతి పథంలో పల్లెలు

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు. పల్లెలు అభివృద్ధి చెందితే దేశం కూడా అభివృద్ధి పథంలో పయనిస్తుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే మహా సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మారుమూల గ్రామాలకు సైతం వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తుండటంతో పల్లెల్లో ప్రగతి పరుగులు తీస్తోంది.

- 'గడప గడపకూ'లో గుర్తించిన పనులు వేగవంతం
- జిల్లాలో రూ.24.79 కోట్లతో పనులు
- చురుగ్గా ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు
- సమస్యల పరిష్కారమే అజెండాగా ముందుకు సాగుతున్న ప్రజాప్రతినిధులు



బత్తలపల్లి మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ స్థలంలో వేగంగా జరుగుతున్న సొంత్ పాఠశాల నిర్మాణ పనులు



మడకశిరలోని హెచ్‌ఆర్ పాళ్యం పాత ఎస్సీ కాలనీలో చేపట్టిన పైప్‌లైన్ పనులు

సాక్షి, పుట్టపర్తి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు 'గడప గడపకూ..' ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు కలిసి నేరుగా ప్రజల వద్దకు వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రజలకు అందిన సంక్షేమ, అభివృద్ధి గురించి వివరించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఆ సమస్యల పరిష్కారం కోసం ఒక్కో సచివాలయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదల చేయడంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యే సిఫారసుతో ..

క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదిత పనులకు స్థానిక ఎమ్మెల్యే సిఫారసు మేరకు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేస్తారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ప్రాధాన్యతా క్రమంలో ప్రజలకు తక్షణం కావాల్సిన పనులను గుర్తిస్తున్నారు. వాటిని మంజూరు చేసి, పనులు ప్రారంభించేందుకు అధికారులు తక్షణం ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాలకు సంబంధించి 'గడప గడపకూలో గుర్తించిన 1,349 పనులకుగానూ రూ.24.79 కోట్లు కేటాయించారు.

సగానికి పైగా సచివాలయాల విజిట్

జిల్లా వ్యాప్తంగా 420 గ్రామ సచివాలయాలు, 124 వార్డు సచివాలయాలు కలిపి మొత్తం 544 ఉన్నాయి. రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలు, హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌లు ఇప్పటి వరకు 342 సచివాలయాలు విజిట్ చేశారు. మరో 202 సచివాలయాలు సందర్శించాల్సి ఉంది. మొత్తం 6,09,316 గడపలకుగానూ 2,74,136 గడపలకు ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

ఏయే పనులంటే..

తాగునీటి వసతి, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, కమ్యూనిటీ భవనాలు, ప్రహరీల నిర్మాణం, కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర పనులు పంచాయతీరాజ్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో ప్రాధాన్యత ఆధారంగా పనులు చేపడుతున్నారు.

ప్రగతి పరుగులు

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పరుగు పెడుతున్నాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రులు అభివృద్ధికి నోచుకున్నాయి. ప్రజల ముంగిటకే సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీలకు కొత్త భవనాలు సమకూరుతున్నాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

నియోజకవర్గాల వారీగా గణాంకాలు

ఎమ్మెల్యే	నియోజకవర్గంలోని సచివాలయాలు	సందర్శించిన సచివాలయాలు
పీవీ సిద్దారెడి	93	82
తిప్పేస్వామి	76	45
కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి	95	75
మాలగుండ్ల శంకరనారాయణ	81	69
దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి	77	34
తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి	36	6
ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్	86	31



అడిగిన వెంటనే పాఠశాల నిర్మాణం

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బత్తలపల్లిలో పర్యటిస్తుండగా సొంత్ పాఠశాల అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, పక్కా భవనాలు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి అడిగాం. ఆయన స్పందించడంతో రూ.70.80 లక్షలతో పక్కా భవనాలను తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల నిర్మాణంలో ఉంది.

– సాకే లక్ష్మన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు, బత్తలపల్లి



పనులపై ప్రత్యేక దృష్టి

'గడప గడపకూ మన ప్రభుత్వం' పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నాం. ప్రాధాన్యత ఆధారంగా పనులు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తూ అధికారులకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నాం.

– బసంత్‌కుమార్, కలెక్టర్

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ బసంత్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14, 18 తేదీల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించి మాత్రలను అందజేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆదేశించారు. ఆయా విద్యాసంస్థల్లో ఎంత మంది పిల్లలు ఉన్నారో గుర్తించి నివేదికను శనివారం నాటికి సిద్ధం చేయాలన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్‌పెట్టొచ్చని, అలాగే వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. చదువుపై ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుందనే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ మీనాక్షి, ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయప్పనాయక్, డాక్టర్ నివేదిత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సంక్షేమశాఖ అధికారులు నిర్మలజ్యోతి, శివరంగప్రసాద్, మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ గాయత్రి తదితరులు ఉన్నారు.

ఏప్రిల్ 15 నాటికి రీసర్వే పూర్తి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం కింద జిల్లాలో చేపట్టిన రీసర్వే పనులను ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి రీసర్వే , మ్యూటేషన్స్ తదితర అంశాలపై స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్, కమిషనర్ సిద్ధార్థ జైన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ల్యాండ్ సర్వే ఏడీ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 26 గ్రామాలు, రెండో విడతలో 25 గ్రామాల్లో రీసర్వే చేపట్టామన్నారు. ఏప్రిల్ 15 నాటికి సర్వే ప్రక్రియ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఏసీబీ వలలో వీఆర్‌ఓ



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు



వీఆర్వో లక్ష్మీదేవి

రొళ్ల: పట్టాదారు పాసు పుస్తకం మంజూరు కోసం ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ రొళ్ల మండలంలోని దొడ్డేరి గ్రామ వీఆర్‌ఓ లక్ష్మీదేవి ఏసీబీకి పట్టుబడ్డారు. గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. కర్నూలు ఏసీబీ డీఎస్పీ, అనంతపురం ఇన్‌చార్జ్ జే.శివనారాయణస్వామి తెలిపిన మేరకు.. రొళ్ల మండలం అప్పేపల్లికి చెందిన రైతు గోవిందరెడ్డి తన తల్లి రంగమ్మ పేరు మీద ఉన్న 4 ఎకరాల భూమిని అన్నదమ్ములైన తిమ్మారెడ్డి, వెంకటచలపతితో కలసి 2021లో మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పట్టాదారు పాసుపుస్తకం కోసం దొడ్డేరి వీఆర్వో లక్ష్మీదేవిని సంప్రదించగా రూ.12 వేలు డిమాండ్ చేసింది. ఇటీవల గోవిందరెడ్డి అడ్వాన్స్ కింద రూ.3 వేలు ఇచ్చారు. గురువారం రూ.6 వేలు ఇస్తానని, పాసుపుస్తకం ఇచ్చిన తర్వాత మిగిలిన రూ.3 వేలు చెల్లిస్తానని గోవిందరెడ్డి చెప్పడంతో వీఆర్వో లక్ష్మీదేవి అందుకు ఒప్పుకున్నారు. ఈ క్రమంలోనే గోవిందరెడ్డి అవినీతి నిరోధకశాఖ అధికారులను సంప్రదించారు. వారి ఆదేశాల మేరకు డబ్బును తను నివాసం ఉన్న ఇంట్లో వీఆర్‌ఓ లక్ష్మీదేవికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. విచారణ అనంతరం కర్నూలు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో అవినీతి నిరోధకశాఖ ఇన్‌స్పెక్టర్లు ప్రభాకర్, మోహన్‌ప్రసాద్, శాంతిలాల్, శంకర్‌రెడ్డి, హేమంత్‌కుమార్, ఎస్‌ఐ హరినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరికి 30 అదనపు బస్సులు



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా ఈ నెల 13న కదిరికి 30 ప్రత్యేక అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం కదిరి డిపోలో అదనపు బస్సుల ఏర్పాటుపై డీఎం మైనోద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి డిపోలో ఉన్న 114 బస్సులతో పాటు అదనంగా మరో 30 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కదిరి నుంచి గోరంట్ల మీదుగా హిందూపురానికి 26 బస్సులు, నల్లమాడకు 7, మదనపల్లికి 25, బెంగళూరు 20, పులివెందుల 9, తలుపుల 7 దాదాపు 117 ట్రిప్పులతో బస్సులు నడుస్తాయన్నారు. జీవిమాను కూడలి, వేమారెడ్డి సర్కిల్, బస్టాండ్, సరస్వతీ విద్యామందిరం బస్‌స్టాప్‌ల వద్ద ఎండ వేడి తగలకుండా ప్రయాణికులకు ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. షెల్టర్ల వద్ద ఇద్దరు పోలీసులు (ఆర్టీసీ కానిస్టేబుల్స్) ఇద్దరు సేఫ్టీ డ్రైవింగ్ శిక్షకులు, వలంటీర్లు, సూపర్‌వైజర్లను నియమిస్తున్నట్లు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థికి సూచనలిస్తున్న డీఈఓ మీనాక్షి

పుట్టపర్తి: 10వ తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని డీఈఓ మీనాక్షి తెలిపారు. గురువారం రాత్రి బుక్కపట్నం మండల కేంద్రంలో ఆమె 10వ తరగతి చదివే విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి పది పరీక్షలకు ఎలా సంసిద్ధులవుతున్నారో పరిశీలించారు. ఇందులో భాగంగానే వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఒత్తిడికి గురి కాకుండా పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగపద్మజ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

రాప్తాదురూరల్: ఇంటర్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐఓ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ సురేష్‌బాబు, పరిశీలకుడు, డీవీఈఓ వెంకటరమణనాయక్ సూచించారు. గురువారం అనంతపురం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులకు (డీఓ) పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ, రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో సీఎస్‌లు, డీఓలు కీలకంగా వ్యవహరించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు గుంపులుగా ఉండకూడదన్నారు. ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలు కేంద్రాల్లోకి అనుమతించొద్దన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత కూడా విద్యార్థులందరినీ ఒకేసారి బయటకు పంపకుండా అంచెలుగా పంపాలన్నారు.

హాల్‌టికెట్లపై ఆందోళన వద్దు

- ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి సురేష్‌బాబు

రాప్తాదురూరల్: ఇంటర్ హాల్‌టికెట్ల విషయంపై విద్యార్థులు ఆందోళన పడాల్సిన పనిలేదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి సురేష్‌బాబు తెలిపారు. రెండుమూడు రోజుల్లో బోర్డు అధికారులు విద్యార్థుల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచుతారని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు చెల్లుబాటవుతుందని పేర్కొన్నారు. హాల్‌టికెట్లపై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకం కానీ, సీలు కాని ఏమాత్రం అవసరం ఉండదని స్పష్టం చేశారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయని, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63,090 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. బోర్డు నుంచి మూడు సెట్ల ప్రశ్నపత్రాలు రావాల్సి ఉండగా గురువారం ఒక సెట్ వచ్చాయని, తక్కిన రెండు సెట్ల ప్రశ్నపత్రాలు శుక్రవారం రానున్నట్లు తెలిపారు. ప్రశ్నపత్రాలను కొత్తూరు బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి పోలీస్ సెక్యూరిటీని ఏర్పాటు చేశామన్నారు. తక్కిన సెట్లు రాగానే స్టోరేజ్ పాయింట్ల (పోలీస్ స్టేషన్)కు తరలిస్తామన్నారు.

వైభవంగా నారసింహుడి బ్రహ్మోత్సవాలు




సూర్యప్రభ వాహనంపై నారసింహుడు

- సూర్య, చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదవ రోజైన గురువారం ఖాద్రీశుడు పగలు సూర్య ప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. లోకంలో పుట్టడం, పెరగడం, నశించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానని చాటిచెబుతూ శ్రీవారు సూర్య, చంద్ర ప్రభలను అధిష్టించి దర్శనమిచ్చారు. సూర్య మండల మధ్యస్థుడైన మహా విష్ణువుకు నారాయణుడని పేరు. పగటికి సూర్యుడు రారాజైతే, రేయికి చంద్రుడు అధిపతి. సృష్టికి ఎంతో ముఖ్యమైన ఈ రేయింబవళ్లను మహావిష్ణువు రెండు కళ్లుగా కలిగివుండి వాటినే వాహనాలుగా మార్చుకొని సృష్టిలో సర్వమూ తానేనని చాటిచెబుతూ తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా అంబే శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

నేడు మోహినీ ఉత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. పాల కడలిని మదించి అందులో ఉద్భవించిన అమృతాన్ని సేవించడానికి దేవతాసురులు పోటీ పడతారు. ఆ అమృతాన్ని పంచడానికి మహా విష్ణువు మోహినీ అవతారమెత్తారు. దేవతలకు అమృతాన్ని పంచిపెట్టి అసురులను మభ్యపెట్టేందుకు శ్రీవారు ఈ అవతారాన్ని ధరిస్తారని భక్తుల నమ్మకం.



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

క్లుప్తంగా

తల్లి హత్య కేసులో కుమారుడి అరెస్ట్

సోమందేపల్లి: పింఛన్ డబ్బు కోసం తల్లిని హతమార్చిన కేసులో కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 1న సోమందేపల్లిలోని పందిపర్తిలో నర్సమ్మ (70)కు పింఛన్ డబ్బులు అందాయి. ఈ నెల 3న ఆ డబ్బు తనకు ఇవ్వాలని కుమారుడు శ్రీనివాసులు గొడవపడి దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయమై ఆమె మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎక్కా ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు గురువారం రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా గరుడోత్సవం



రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి భక్తులకు గరుడ వాహనంపై శ్రీవారు దర్శనమిచ్చారు. ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పూలపల్లకీపై దేవేరులతో కలసి శ్రీవారు దర్శనమివ్వనున్నారు.

అధికారిక లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ మల్లికార్జున నాయుడు అంత్యక్రియలు గురువారం స్వగ్రామం తోడేళ్లగడ్డపల్లిలో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. మృతదేహం వద్ద పూలదండను ఉంచి పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంభూపాల్, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటస్, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీస్ అసోషియేషన్ సభ్యులు త్రిలోక్‌నాథ్, తేజ్‌పాల్, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చేప.. ఉపాధికి తోవ

- ఫిష్ ఆంధ్ర'తో యువతకు స్వయం ఉపాధి
- రూ.50 లక్షల వరకూ సబ్సిడీతో యూనిట్లు
- జిల్లాలో 20 'ఫిష్ ఆంధ్ర' అవుట్‌లెట్ల ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు ప్రొటీన్లతో కూడిన ఆహారం... మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో జగన్ సర్కార్ 'ఫిష్ ఆంధ్ర' పేరుతో అవుట్‌లెట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన చేపలను తక్కువ ధరకే వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పాటు నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి కల్పన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితాలనే ఇస్తోంది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 20 ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లు ఏర్పాటు కానున్నాయి.

సబ్సిడీతో యూనిట్ల మంజూరు

చేపల వినియోగంతో పాటు ఉపాధి మార్గాలను పెంచుతూ జిల్లాలో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లు, దుకాణాలు, రెస్టారెంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీతో యూనిట్లను మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం, , బీసీ, ఇతర వర్గాల వారికి 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోంది. జిల్లాలో లైవ్ ఫిష్ అమ్మే దుకాణాలు, అవుట్‌లెట్లు, ఫుడ్ కోర్టుల ఏర్పాటుతో పాటు చేపలు అమ్మకానికి, తరలించడానికి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్లు కొనుగోలుకు రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకూ సబ్సిడీ రుణాలు అందజేస్తున్నారు. లైవ్‌ఫిష్ అమ్మకాల యూనిట్ ఏర్పాటుకు లబ్ధిదారులు రూ.10 వేలు డిపాజిట్టు చెల్లిస్తే రూ.లక్ష... రూ.20 వేలు చెల్లిస్తే రూ.2 లక్షలను ప్రభుత్వం అందజేస్తుంది. అంతేకాక డైలీ మోడల్ ఫార్మాట్ యూనిట ఏర్పాటుకు రూ.10 లక్షల వరకూ రుణం అందజేస్తారు. ఇందులో తాజా చేపలతో పాటు చేపల ఉత్పత్తులతో చేసిన వివిధ రకాల స్నాక్స్‌ను విక్రయిస్తారు. అలాగే రెస్టారెంట్లు ఏర్పాటు చేసుకునేవారికి రూ.20 లక్షల వరకూ రుణం అందజేస్తారు. 30 మంది కూర్చొని తినేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ స్నాక్స్‌తో పాటు బిర్యానీ, ఫుడ్ ఐటమ్స్ విక్రయిస్తారు. లాంజ్ మోడల్ ఏర్పాటుకు రూ.50 లక్షల వరకూ రుణం మంజూరు చేస్తారు. ఇందులో పెద్ద ఒవెన్‌లు ఏర్పాటు చేస్తారు. అన్ని రకాల చేపల వంటకాలు విక్రయిస్తారు. టిఫెన్లు సైతం అందుబాటులో ఉంటాయి. యూనిట్ ఏదైనా లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని చెల్లించిన తర్వాతనే మిగిలిన సొమ్మును బ్యాంకు రుణంగా మంజూరు చేస్తుంది.



కొత్తచెరువు వద్ద ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్



ఫిష్ ఆంధ్ర, చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేపల పెంపకానికి అనువుగా జిల్లా

జిల్లాలో చేపల పెంపకానికి అనువైన 223 చెరువులు ఉన్నాయి. వీటితో పాటు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్), యోగి వేమన, గుంజేపల్లి రిజర్వాయర్లు, లైసెన్సు కలిగిన రామగిరి మండలం పేరూరు డ్యాం అనువుగా ఉన్నాయి. ఇటీవల పేరూరు డ్యాంలో సుమారు 4.5 లక్షల చేప పిల్లలను వదిలారు. జిల్లాలో మొత్తం 80 అవుట్‌లెట్ల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకోగా... ప్రస్తుతం 20 సిద్ధం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియగానే ఈ నెలాఖరులో వీటిని ప్రారంభించనున్నారు. ఇందులో కొత్తచెరువు మండలంలో 3, పెనుకొండ 4, కదిరి 3, హిందూపురం 4, ధర్మవరం 2, ముదిగుబ్బ, చెన్నేకొత్తపల్లి, రామగిరి, నల్లమాడల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రారంభించనున్నారు. వీటికి కావాల్సిన చేపలు, రొయ్యలు, పీతలను ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. వీటి విక్రయానికి అవసరమైన ద్విచక్ర వాహనం(టీవీఎస్ మోపెడ్), ఆటోలు, ఐస్ బాక్సులు, తూకం మిషన్లు సమకూరుస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



మినీ ఫిష్ అవుట్‌లెట్లు, దుకాణాల ఏర్పాటుకు ముందుకువచ్చేలా యువతకు అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి కలిగిన వారు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించాలి. ఈ–మత్స్యశాఖ యాప్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. అవుట్ లెట్లకు కావాల్సిన చేపలను ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఈ నెలాఖరుకు 20 యూనిట్లను ప్రారంభించనున్నాం.

– చంద్రశేఖరరెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి

ఆటోడ్రైవర్ బలవన్మరణం

అనంతపురం సిటీ: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... అనంతపురంలోని హెచ్చెల్సీ సమీపంలో రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లుగా గురువారం ఉదయం సమాచారం అందడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సాయంత్రానికి మృతుడిని కక్కలపల్లి కాలనీలోని మండ్ల సుబ్బారెడ్డి నగర్ నివాసి జోగి నీలకంఠేశ్వర (45)గా గుర్తించారు. మృతుని మొదటి భార్య ఆరేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటికే వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ తర్వాత రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కొంత కాలంగా వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న అతను జీవితం విరక్తి పెంచుకుని గురువారం వేకువజాము 1.30 గంటలకు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్

గల్లంతైన యువకుడి మృతి

గుంతకల్లు రూరల్: హోలీ సంబరాల్లో పాల్గొన్న అనంతరం స్నేహితులతో కలసి బుధవారం హంద్రీనీవా కాలువలో స్నానానికి వెళ్లిన అసిస్టెంట్ లోకో పైలెట్ అంకిత్ ఖేర్ (28) గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం చీకటి పడేవరకూ పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం ఉదయాన్ని తిరిగి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రానికి అంకిత్‌ఖేర్ మృతదేహాన్ని జి.కొట్టాల సమీపంలో గుర్తించి వెలికి తీశారు.

'సూపర్'లో అరుదైన శస్త్ర చికిత్స

- నాలుగు నెలల చిన్నారికి ప్రాణం పోసిన వైద్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. నాలుగు నెలల చిన్నారి మెదడులోని క్యాన్సర్ గడ్డను తొలగించి ప్రాణం పోశారు. ఇప్పటి వరకూ మెట్రో నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే అందుతున్న ఈ అరుదైన శస్త్రచికిత్సను జిల్లా కేంద్రానికి చేరువ చేశారు. వివరాలను గురువారం సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత వైద్యులు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు (చిత్రంలో) చిన్నారి కుటుంబసభ్యులు

ఏం జరిగిందంటే..

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని న్యూ కాలనీకి చెందిన నవీన్‌కుమార్, వనజ దంపతులకు నాలుగు నెలల వయసున్న కుమార్తె బిందు ఉంది. గత నెల తీవ్రమైన జ్వరంతో చిన్నారి బాధపడుతుండగా ఫిట్స్ వచ్చాయి. దీంతో హుటాహుటిన అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు వెంటనే సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు రెఫర్ చేశారు. పలు వైద్య పరీక్షల అనంతరం చిన్నారి మెదడులో క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు న్యూరో సర్జన్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు గుర్తించారు. శస్త్రచికిత్స చేస్తే చిన్నారి ప్రాణాలు దక్కుతాయని తల్లిదండ్రులకు తెలిపి, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. గత నెల 25న చిన్నారికి శస్త్రచికిత్స చేశారు.



చిన్నారి బిందు

15 రోజుల పాటు ప్రత్యేక నిఘా

శస్త్ర చికిత్స అనంతరం చిన్నారి కోలుకునేందుకు అవసరమైన చర్యలను వైద్య నిపుణులు తీసుకున్నారు. 15 రోజుల పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పీడియాట్రీషన్ నేతృత్వంలో చికిత్సలు అందజేశారు. అనంతరం చిన్నారి క్రమంగా కోలుకుంటూ వచ్చింది. ఈ శస్త్రచికిత్సకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.6 లక్షల వరకూ ఫీజులు వసూలు చేస్తారు. ఇంతటి ఖరీదైన శస్త్రచికిత్సను రూపాయి ఖర్చు లేకుండా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు ఉచితంగా చేశారు.

ఇంకో చిన్నారికీ ప్రాణదానం

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పామిడి మండలం పొగరూరు గ్రామానికి చెందిన చిన్నారి రాజేష్‌కు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తల్లిదండ్రులు సరైన చికిత్సను అందించలేకపోయారు. ఈ క్రమంలో మెదడులో చీము గడ్డ కట్టింది. దీంతో ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో తల్లిదండ్రులు చేర్పించారు. ప్రత్యేక చికిత్సల ద్వారా చిన్నారి మెదడులోని చీము గడ్డను వైద్యులు తొలగించారు. ప్రస్తుతం ఆ చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు. ఇదే తరహా వైద్యాన్ని గుంతకల్లుకు చెందిన యువకుడు మస్తాన్ వలి(బయోమా ట్యూమర్)కి సైతం వైద్యులు అందజేశారు. విలేకరుల సమావేశంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సూపర్ స్పెషాలిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, న్యూరో సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కర్, డాక్టర్ సంజీవప్ప, డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు, డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ యదుభూషణ్‌రెడ్డి, టెక్నీషియన్లు వన్నూర్‌వలి, పవన్‌కుమార్, అశోక్, కిరణ్మయి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యత ఓటు వేయండి

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి

పుట్టపర్తి అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి అభ్యర్థించారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ శాఖలు, బుక్కపట్నం మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలను గురువారం ఆయన సందర్శించి, ఉద్యోగులను ఓటు అభ్యర్థించారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒకేసారి లక్షలాది ఉద్యోగాలను ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, జగన్ పాలనపై ప్రపంచ దేశాలు ప్రశంసలు కురిపిస్తున్నాయన్నారు. అలాంటి నాయకత్వం పది కాలాల పాటు ఉండేలా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ శ్రీలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడుమాబుసాబ్, కో–ఆపరేటివ్ సొసైటీ విశ్రాంత రిజిస్ట్రార్ రుద్రప్రసాదరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, సూర్యగౌడ్, సాయిగీత, పార్టీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, సీనియర్ నాయకులు లోచర్ల విజయభాస్కరరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, బ్రిక్స్‌సాయి, రఘునాథరెడ్డి, కవిత, మురళీధర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, లాయర్లు నాగమల్లీశ్వరరెడ్డి, సురేందర్‌రెడ్డి, పైపల్లి నరసింహులు పాల్గొన్నారు.



పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఓట్లు అభ్యర్థిస్తున్న వెన్నపూస గోపాలరెడ్డి

వివాహిత ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని గాంధీనగర్‌కు చెందిన మధుసూదన్‌గౌడ్ మొదటి భార్య వదిలేసి వెళ్లడంతో ఆరేళ్ల క్రితం అప్పటికే భర్తకు విడాకులు ఇచ్చిన అనంతపురం నివాసి ప్రసన్నలక్ష్మి (40)ని రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య కుమారుడు మధుసూదన్ వద్దనే ఉంటున్నాడు. రెండో భార్యకు పిల్లలు పుట్టకపోవడంతో దంపతులు తరచూ గొడవపడేవారు. గురువారం మధ్యాహ్నం తప్పతాగి వచ్చిన భర్తతో భార్య గొడపడింది. అనంతరం భర్త బయటకు వెళ్లిన సమయంలో బెడ్‌రూంలో తాను కట్టుకున్న చీరతోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి చేరుకున్న భర్త బెడ్‌రూం తలుపులు మూసి ఉండడంతో పైన ఉన్న కిటికీలో నుంచి చూస్తే ఉరికి వేలాడుతున్న ప్రసన్నలక్ష్మి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, అప్పటి వరకూ మధుసూదన్‌గౌడ్‌ను అదుపులో ఉంచుకుంటామని పేర్కొన్నారు.



ప్రసన్నలక్ష్మి(ఫైల్)

భర్త హత్య కేసులో భార్య, కుమార్తె అరెస్ట్

మడకశిర: భర్త హత్య కేసులో భార్యతో పాటు కుమార్తెనూ మడకశిర పోలీసులు అరెస్ట్ చేశారు. సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ నాగేంద్ర వెల్లడించారు. మడకశిర మండలం కల్లుమర్రి గ్రామానికి చెందిన హనుమంతప్ప (53) ఈ నెల 7న రాత్రి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఇంటి ఎదుట పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులు అందజేసిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని, పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో హనుమంతప్ప భార్య అక్కమ్మ, కుమార్తె అనిత ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలీలో పోలీసులు విచారణ చేశారు. దీంతో హనుమంతప్పను హత్య చేసినట్లుగా వారు అంగీకరించారు. హతుడు హనుమంతప్పకు అనిత, సంధ్యారాణి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె అనిత హిందూపురం మండలం బసవనపల్లి గ్రామానికి చెందిన సురేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొన్నేళ్ళు గడచిన వీరికి సంతానం కలుగలేదు. దీంతో చిన్న కుమార్తె సంధ్యారాణిని సురేష్‌కు ఇచ్చి పెళ్లి చేయాలని హనుమంతప్పపై భార్య అక్కమ్మతో పాటు కుమార్తె అనిత ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే ఇందుకు హనుమంతప్ప అంగీకరించలేదు. ఈ క్రమంలో పావగడ తాలూకా నాగాలాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణతో చిన్నకుమార్తెకు వివాహం జరిపించాడు. దీంతో కక్ష పెంచుకున్న అక్కమ్మ, అనిత.. పథకం ప్రకారం ఈ నెల 7 రాత్రి 11 గంటలకు పశువుల కొట్టంలో నిద్రిస్తున్న హనుమంతప్ప కళ్లకు కారం పొడి చల్లారు. అనంతరం గొడ్డలి కాముతో తలపై, మర్మాంగంపై బలంగా కొట్టి హతమార్చారు. నిందితులను గురువారం అరెస్ట్ చూపి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

భక్త జనసంద్రం.. కాటి కోటేశ్వర క్షేత్రం



విశేష పూజలందుకుంటున్న క్షేత్రంలోని కాటికోటేశ్వరుడు



క్షేత్రంలో నుంచి ముష్టూరుకు తిరిగి వెలుతున్న కాటమయ్యస్వామి ప్రభ

బత్తలపల్లి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా బత్తలపల్లి మండలం సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రం గురువారం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకూ వచ్చి పోయే భక్తులతో క్షేత్రం జనసంద్రమైంది. బుధవారం రాత్రి ఒంటి గంటకు లంకాదహనం కార్యక్రమం ముగియడంతో ప్రధాన ఘట్టం పూర్తయింది. ఉత్సవాల్లో మూడో రోజైన గురువారం పరుష వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లతో కొండ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను కానుకలుగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రంలో వెలసిన వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు స్వామి మూలస్థానమైన ఈదుల ముష్టూరుకు ప్రభను తరలించారు. శుక్రవారం మారుపూజ నిర్వహించిన అనంతరం జంతు బలులతో ఉత్సవాలకు ముగింపు పలకనున్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ సుధాకరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నరసింహరెడ్డి, మాజీ ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, అర్చకులు కొండన్న, శీనప్ప, బూసప్ప, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

గోరంట్ల: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను గోరంట్ల సీఐ సుబ్బరాయుడు వెల్లడించారు. గురువారం ఉదయం గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఆటోను నిలిపి తనిఖీ చేయగా రెండు బాక్సుల్లో 192 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి, మద్యం తరలిస్తున్న జక్కసముద్రం నివాసి రఘునాథరెడ్డిని అరెస్ట్ చేశారు.

మల్లె గుబాళింపు.. కుంకుమ తిలకం



కదిరి మల్లెలు, దవనం



కదిరిలో విక్రయిస్తున్న కుంకుమ



బ్రహ్మోత్సవాల ప్రత్యేకం

కదిరి: కుంకుమ.. మల్లెలు అంటే మగువలకు ఎంతో ఇష్టం. అయితే ఇందులోనూ కదిరి ప్రాంతానికి చెందిన కుంకుమ, మల్లెలు, దవణం అంటే చాలు దక్షిణ భారతదేశం మొత్తం ఆసక్తి చూపుతుంది. ఈ ప్రాంతంలో సాగవుతున్న మల్లెలు పొరుగు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతుంటాయి. పూలు విక్రేతలు సైతం ప్రత్యేకంగా 'కదిరి మల్లెలు' అంటూ కేక వేసి మరీ కొనుగోలుదారులను ఆకట్టుకుంటుంటారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు జరిగే పక్షం రోజులూ ఈ మల్లెలతోనే శ్రీవారిని అలంకరిస్తారు. కదిరి ప్రాంతంలో పండించే దవణాన్ని సెంట్లు, అత్తర్ తయారీలో వినియోగిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడి నుంచి ముంబయి, బెంగళూరు తదితర మెట్రో నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రత్యేక సువాసనను వెదజల్లే కదిరి కుంకుమ.. మగువల మదిని దోచేస్తోంది. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఈ మూడింటిని తప్పనిసరిగా కొనుగోలు చేసి, తమ ప్రాంతాలకు తీసుకెళుతుంటారు.